క్లుప్తంగా

కారెంపూడి వెటన్నరీ డాక్టర్‌గా పద్మావతి

కారెంపూడి: కారెంపూడి మండల వెటన్నరీ అసిస్టెంట్ సర్జన్‌గా కల్లుట్ల పద్మావతి శనివారం విధుల్లో చేరారు. విధుల్లో చేరిన అనంతరం మాచర్ల వెళ్లి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పిన్నెల్లి వెంకటరామిరెడ్డిలను వెటన్నరీ డాక్టర్ దంపతులు మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రభుత్వ పథకాలను రైతులకు సక్రమంగా అందించడంతో పాటు మెరుగైన పశువైద్య సేవలను రైతులకు గ్రామాల్లోనే అందించాలని ప్రభుత్వ విప్ పీఆర్కే వీఏఎస్ పద్మావతికి సూచించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు తన విధులను చిత్తశుద్ధితో సక్రమంగా నిర్వహిస్తానని పద్మావతి ఈ సందర్భంగా పేర్కొన్నారు.

విద్యతోనే అభివృద్ధి

ఏఎస్‌డబ్ల్యూఓ సుజాత కుమారి



గురజాల : విద్యతోనే జీవితంలో మంచి ఉన్నత స్థాయికి ఎదగవచ్చని ఏఎస్‌డబ్ల్యూఓ సుజాత కుమారి సూచించారు. సాంఘీక సంక్షేమ శాఖ బాలికల వసతి గృహానికి చెందిన విద్యార్థులు పదో తరగతిలో మంచి మార్కులు సాధించి జగనన్న ఆణిముత్యాలుకు ఎంపికైన వారిని ఏఎస్‌డబ్ల్యూఓ అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యపరంగా ఎన్నో సంస్కరణలు రూపొందించడం జరిగిందని ప్రతి పేదవాడు ఉన్నత చదువులు చదువుకునే విదంగా మార్పు తీసుకురావడం జరిగిందన్నారు. నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా వసతి గృహాలు, ప్రభుత్వ పాఠశాలలు రూపురేఖలు మారిపోతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో వార్డెన్ శిరోమణి తదితరులున్నారు.

మెగా కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

వెల్దుర్తి: మండలంలోని మండాదిలో శనివారం జరిగిన ఉచిత మెగా కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించినట్లు గ్రామ సర్పంచ్ శీలం సైదారెడ్డి అన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సర్వేంద్రియాల్లో నయనం ప్రధానమైందని, అందరికీ నాణ్యమైన కంటి వైద్యమందించాలనే సంకల్పంతో పల్నాడు జిల్లా నర్సరావుపేట డా'' రామలింగారెడ్డికి చెందిన మ్యాక్సివిజన్ కంటి ఆసుపత్రి వారి ఆధ్వర్యంలో జరిగిన ఉచిత కంటి వైద్య శిబిరానికి 153 మంది హాజరు కాగా వారికి డా'' ఈశ్వరరెడ్డి వైద్య బృందం ఆధ్వర్యంలో ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. గ్రామ సచివాలయంలో ఉదయం 10గం''ల నుంచి సాయంత్రం వరకు నిర్వహించారు. మారుమూల ప్రాంతాల్లో ఎలాంటి ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించటం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో వైద్యులు వీరయ్య, సారధి, హేమంత్, కె రాజు, వైఎస్సార్ సీపీ నాయకులు చిన్నపరెడ్డి చిన మల్లారెడ్డి, లింగారెడ్డి, ఎంపీటీసీ కాంతారావు, వెంకట నారాయణ పాల్గొన్నారు.

ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

మాచర్ల: వెనుకబడిన ప్రాంతంలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తూ తెలంగాణ రాష్ట్రానికి చెందిన హైదరాబాద్‌లోని హిటిరో డ్రగ్స్ సంస్థ ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి ముందుకు రావడం ఎంతో అభినందనీయమని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి అన్నారు. శనివారం స్థానిక చక్రధర్ డిగ్రీ కళాశాలలో జరిగిన స్పెషల్ జాబ్ మేళా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఉత్తమ చదువు చదివిన విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు సంస్థ ముందుకు రావడంతో ఆయన అభినందించారు. ఈ సందర్భంగా నిర్వహించిన జాబ్ మేళాకు 76 మంది విద్యార్థులు హాజరు కాగా వారిలో 30 మందిని ఎంపిక చేసి ఉద్యోగ లెటర్లను అందజేసినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ముందుకెళ్ళాలన్నారు. కార్యక్రమంలో హిటిరో హెచ్ఆర్ మేనేజర్ విజయ్ కుమార్, కుర్రి పవనేశ్వరరెడ్డి, జి వెంకటేష్, చక్రధర్ కళాశాల డైరెక్టర్ ఎం మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

బస్సు ఢీకొని గేదె మృతి

వినుకొండ(నూజెండ్ల): ప్రయివేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొట్టడంతో చూడి గేదె మృతి చెందిన సంఘటన నూజెండ్ల మండలం ఐనవోలు గ్రామంలో శనివారం జరిగింది. సేకరించిన వివరాలప్రకారం గ్రామానికి చెందిన పగడాల లక్ష్మీనారాయణకు చెందిన గేదె రోడ్డు దాటుతుండగా బెంగుళూరు నుంచి వినుకొండ వస్తున్న కావేరి ట్రావెల్స్‌కు చెందిన బస్సు ఢీకొట్టింది. ఈప్రమాదంలో గేదె అక్కడిక్కడే మృతి చెందింది. దీంతో బాధితుడు ఐనవోలు స్టేషనులో ఫిర్యాదు చేయగా కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అరుణాచలానికి ఆర్టీసీ బస్సు

చిలకలూరిపేటటౌన్: ఏపీఎస్ ఆర్టీసీ చిలకలూరిపేట డిపో ఆధ్వర్యంలో ప్రతి పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని అరుణాచలేశ్వరుడి దర్శనం కోసం ప్రత్యేక బస్సు సర్వీస్ నడుపుతున్నట్లు డిపో మేనేజర్ సింహాద్రి రాంబాబు చెప్పారు. ఈ నెల 22 తేదీ రాత్రి 10 గంటలకు ప్రత్యేక బస్సు బయలదేరనున్నట్లు వివరించారు. టికెట్ రూ.2,500 ఉంటుందన్నారు.

ఈ సంక్షేమాన్ని ఇలాగే కొనసాగిద్దాం

ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి



ప్రభుత్వం చేకూర్చిన సంక్షేమాన్ని మహిళకు వివరిస్తున్న ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

కారెంపూడి: ఈ సంక్షేమ పాలనను ఇలాగే కొనసాగించేందుకు జగనన్న ప్రభుత్వానికి మద్దతుగా నిలవాలని పేదల అభ్యున్నతి కోసం శ్రమిస్తున్న ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి (పీఆర్కే) ప్రజలను కోరారు. కారెంపూడిలో శనివారం రాత్రి గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే పీఆర్కే 10వ రోజు నిర్వహించారు. కారెంపూడి తండా, ఆదినారాయణ కాలనీలో ఎమ్మెల్యే పీఆర్కే గడప గడపకు పర్యటించారు. గత నాలుగేళ్ల కాలంలో ప్రభుత్వం ఏయే పథకాల కింద ఎంత లబ్ధి చేకూర్చింది ఎమ్మెల్యే పీఆర్కే ప్రతి గడపలో వివరించారు. వారు చెప్పిన సమస్యలను విని పరిష్కారానికి అధికారులకు ఆదేశాలిచ్చారు. ఏ కుటుంబానికి కష్టం వచ్చినా తాను అండగా ఉంటానని భరోసా కల్పించారు. గత ప్రభుత్వంలో మాదిరిగా ఎవరూ కూడా ప్రభుత్వ సంక్షేమ పథకాల కోసం ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి లేదని, మీ గడప వద్దకే వచ్చి సమస్యలను పరిష్కరించేవిధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. కరోనా కష్టకాలంలో సైతం పేద ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ప్రభుత్వం చిత్తశుద్ధితో సంక్షేమాన్ని అందించి ప్రజలను ఆదుకున్న తీరును ప్రజలకు వివరించారు. ప్రభుత్వ బడులను పేద విద్యార్థులు బాగా చదువుకునేందుకు వీలుగా ప్రభుత్వం అభివృద్ధి చేయడంతో పాటు పిల్లలను బాగా చదివించుకునేందుకు తల్లిదండ్రులకు అమ్మ ఒడి పథకం ద్వారా ప్రభుత్వం ఆసరాగా నిలుస్తోందన్నారు. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అభ్యసించేందుకు ప్రభుత్వం సకల సౌకర్యాలు కల్పిస్తోందని, విద్యార్థులు బాగా చదివించుకోవాలని తల్లిదండ్రులను ఎమ్మెల్యే పీఆర్కే కోరారు. విద్యే భవిష్యత్తు తరానికి తరగని ఆస్తిగా భావించి జగనన్న ప్రభుత్వం విద్యాభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను వివరించారు. గత పాలనకు ఇప్పటికి తేడా గమనించి సంక్షేమ పాలనకు మద్ధతు పలకాలని పీఆర్కే కోరారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, గిరిజనుల అభివృద్ధి కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. పేద ప్రజల ఆర్థిక ఉన్నతికి ఉపయోగపడే విధంగా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల వల్ల పేదల జీవితాలకు వెలుగు వచ్చిందని ఈ సంక్షేమం ఇలాగే కొనసాగితే పేదరికం అనేది లేకుండా పోతుందన్నారు. ప్రతి కుటుంబానికి ప్రభుత్వం వివిధ పథకాల ద్వారా చేయూత అందించిందని పేర్కొన్నారు. ప్రభుత్వం చేసిన మేలును గుర్తించి వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి అండగా నిలవాలని ఎమ్మెల్యే పీఆర్కే కోరారు. గడప గడపలో ఎమ్మెల్యే పీఆర్కేకు సాదరస్వాగతం లభించింది. ప్రజలు ఎమ్మెల్యే పీఆర్కేను శాలువాలు పూలమాలలతో సన్మానించి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ సర్పంచ్ రమావతు ప్రమీలాభాయితేజానాయక్, ఎంపీపీ మేకల శారదా శ్రీనివాసరెడ్డి, జెడ్పీటీసీ షేక్ షఫీ, వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ షేక్ అక్బర్, మండల, పట్టణ పార్టీ అధ్యక్షుడు కొంగర సుబ్రమణ్యం, బొమ్మిన అల్లయ్య, మండల పార్టీ కార్యదర్శి పాతూరి రామిరెడ్డి, మండల యువజన విభాగం అధ్యక్షుడు చిలుకూరి చంద్రశేఖరరెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ అల్లు వెంకటేశ్వరరెడ్డి, కరాలపాటి సుబ్బారావు, పలిశెట్టి కోటేశ్వరరావు, ఆశం విజయ భాస్కరరెడ్డి, రమావతు కృష్ణానాయక్, కొమ్ము చంద్రశేఖర్, కొమెర పిచ్చెయ్య, వేముల లింగయ్య, బత్తిన వెంకయ్య, కొత్తా బ్రహ్మేశ్వరరావు, ఉన్నం గిరి, రామదేని ఆంజనేయులు ఎంపీడీఓ జి శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్ జి శ్రీనివాసయాదవ్, సీఐ జయకుమార్, ఎస్ఐ రామాంజనేయులు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్య ద్వారానే అభివృద్ధి సాధ్యం

జూనియర్ సివిల్ జడ్జి మురళీ గంగాధర్‌రావు



కార్యక్రమంలో మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి మరళీ గంగాధరరావు

మాచవరం: విద్య ద్వారా కుటుంబాల అభివద్ధితో పాటు సమాజం అభివృద్ధి చెందుతుందని పిడుగురాళ్ల కోర్టు జూనియర్ సివిల్ జడ్జి ఎం. మురళీ గంగాధర్‌రావు అన్నారు. మండలంలోని గంగిరెడ్డి పాలెం ఎస్సీ కాలనీలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ఎస్ఐ ఎస్. కోటయ్య అధ్యక్షతన న్యాయ విజ్ఞాన సదస్సు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య బాలల హక్కు అని, బాల కార్మిక వ్యవస్థ చట్ట రీత్యా నేరమన్నారు. చిన్నారులు చదువుకునేందుకు ప్రభుత్వం ఎన్నో ప్రోత్సాహక పథకాల అందిస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకుని ప్రతి తల్లిదండ్రి పిల్లల్ని చదివించాలన్నారు. చదువుకోవడం వల్ల విజ్ఞానం పెంపొందుంతుదన్నారు. విద్యను ప్రోత్సహిస్తూ నేడు అనేక స్వచంద సంస్థలు చేయూత అందిస్తున్నట్లు చెప్పారు. చదవును అశ్రద్ధ చేయవద్దని కోరారు. చదువుకుని ఉద్యోగ కల్పన పొందిన అనేక కుటుంబాలు ఆర్థికంగా ఎదిగి ఉన్నతంగా ఉన్నాయన్నారు. గ్రామాల్లో చిన్న చిన్న గొడవలు, కక్షలు విడనాడాలని, కోర్టుల్లో ఉన్న కేసులు రాజీ మార్గం ఉత్తమ మార్గమని, న్యాయ స్థానాలు ఏర్పాటు చేసిన లోక్ అధాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దురవ్యసనాలు విడనాడి కుంటుబాల అభివృద్ధికి పాటు పడాలని, ప్రతి ఒక్కరు ఆదర్శ బావాలు కలిగి జీవించాలని, సమాజాభివృద్ధి కృషి చేయాలని ఎస్ కోటయ్య తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఎం.సత్యన్నారాయణ, మార్కెట్ యార్డు డైరెక్టర్ ఎం.రాము, గ్రామ పెద్దలు ఆంజనేయులు, చిన అంజి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మెరుగైన సేవలను అందించాలి

డీఎంహెచ్ఓ శోభారాణి



పీహెచ్‌సీలో చేపట్టాల్సిన పనులను వివరిస్తున్న ఎంపీపీ దాసరి చౌడేశ్వరి, డీఎంహెచ్ఓ

రెంటచింతల: ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు మెరుగైన సేవలను అందించేందుకు వైద్యులు, సిబ్బంది కృషిచేయాలని డీఎంహెచ్ఓ డా.శోభారాణి అన్నారు. శనివారం స్థానిక పీహెచ్‌సీ సెంటర్‌ను ఆమె అకస్మింగా సందర్శించారు. ఆస్పత్రి పరిసరాలను, రికార్డులను తనిఖీ చేశారు. సమయపాలన పాటించి రోగులకు తగిన సేవలను అందించేందుకు పీహెచ్‌సీ సిబ్బంది సిద్ధంగా ఉండాలన్నారు. పీహెచ్‌సీలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులను, రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు పీహెచ్‌సీలో వివిధ వైద్య పరికరాలను అందుబాటులోకి తీసుకురావాలని ఎంపీపీ దాసరి చౌడేశ్వరి డీఎంహెచ్ఓ దృష్టికి తీసుకువచ్చారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో మంచి వైద్యం అందుతుందనే భావన ప్రజల్లో కల్గించాలని ఆరోగ్య సిబ్బందికి సూచించారు. అనంతరం వైఎస్ ఎంపీపీ ఏరువ శౌరెడ్డి డీఎంహెచ్ఓలను దుశ్శాలువతో ఘనంగా సన్మానించారు. పాలువాయి వైఎస్సార్ హెల్త్ సెంటర్‌ను డీఎంహెచ్ఓ శోభారాణి సందర్శించి ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని పరిశీలించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించి హెల్త్ సెంటర్‌కు వచ్చేవారికి అందుబాటులో ఉంటూ ఒక నమ్మకం కలిగించాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువచ్చిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ఒక గొప్పకార్యక్రమం అన్నారు. గ్రామీణా ప్రాంతంలోని ప్రజలకు ఈ కార్యక్రమం ద్వారా క్షేత్ర స్థాయిలోనే వైద్య సహాయం అందుతుందన్నారు. ఆమె వెంట పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ నర్రా కృష్ణారెడ్డి వైద్య సిబ్బంది ఉన్నారు.

ఉత్తమ సేవలతోనే గుర్తింపు



బదిలీపై వెళ్లిన కమిషనర్ శ్రీవిద్యను సన్మానిస్తున్న సిబ్బంది

దాచేపల్లి : నగర పంచాయతీ కమిషనర్‌గా విధులు నిర్వహించి ఇటీవల బదిలీ అయిన అనిశెట్టి శ్రీవిద్యను శనివారం సన్మానించారు. రెండేళ్ల పాటు కమిషనర్‌గా పని చేసి మంచి పేరు సంపాదించుకున్న శ్రీవిద్యను నగర పంచాయతీ కార్యాలయంలో శాలువా, పూలదండలతో సన్మానించి మెమోంటోలు అందించారని, పిన్న వయస్సులోనే కమిషనర్‌గా తొలిపోస్టింగ్‌లో శ్రీవిద్య సమర్థవంతంగా పని చేసి మంచి పేరు సంపాదించుకున్నారని, కొత్తగా ఏర్పాటైన నగర పంచాయతీ అభివృద్ధిలో శ్రీవిద్య కీలకపాత్ర పోషించారని చైర్మన్ కొప్పుల సుబ్బమ్మ సాంబయ్య అన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి కమిషనర్ సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కోట కృష్ణ, కౌన్సిలర్లు నాగుబండి గురువులు, చాట్ల క్రాంతికుమార్, వందనపు వెంకట్రామయ్య, మార్కెట్‌యార్డు డైరెక్టర్లు యర్రంశెట్టి సైదారావు, బుగ్గల జానీ, ఆర్ఐ ప్రసాద్, కుందురు తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ నిర్మాణానికి సహకరించాలని వినతి



కలెక్టర్ లోతేటి శివశంకర్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణంలోని గ్రంథాలయ నిర్మాణానికి సహకరించాలని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, ఎస్ఎఫ్ఐ నాయకులు జిల్లా కలెక్టర్ ఎల్. శివశంకర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ 1953 నుంచి పిడుగురాళ్ల పట్టణంలో గ్రంథాలయం అద్దె భవనంలోఉందని ఈ విషయాన్ని స్థానికులు ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి దృష్టికి తీసుకుని వెళ్తే 10 సెంట్లు శాషన్ చేయించారని, అది సర్వే నంబర్ 202లో ఉండడంతో దానికి డిపో మేనేజర్ అడ్డంకి తెలియజేయడంతో గ్రంథాలయ నిర్మాణం ఆగిపోయిందని కలెక్టర్ దృష్టికి తీసుకుని వెళ్లడం జరిగిందన్నారు. కలెక్టర్ ఎల్ శివశంకర్ సానుకూలంగా స్పందించి వెంటనే గ్రంథాలయ నిర్మాణ జరిగేలా చూస్తానని ఆయన తెలియజేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కోటా సాయికుమార్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయులురాజు, ఎస్ఎఫ్ఐ ఉపాధ్యక్షురాలు నవిత, అమూల్య తదితరులు పాల్గొన్నారు.

దిశ యాప్ పై అవగాహన

మాచర్ల: పట్టణ సీఐ టి బాలకృష్ణ ఆధ్వర్యంలో మూడు రోజులుగా వివిధ ప్రాంతాల్లో దిశ యాప్ పై అవగాహన కల్పిస్తూ వందలాది మందికి దిశ యాప్‌ను సెల్‌లో అప్‌లోడ్ చేశారు. శనివారం పలు ప్రాంతాల్లో సచివాలయ కానిస్టేబుల్స్, పోలీసు సిబ్బంది, ఎస్ఐ అరుణ, సుందర రాజన్‌లు ప్రజలకు దిశ ప్రాధాన్యత గురించి వివరించారు. అనంతరం ఎక్కడికక్కడ దిశ యాప్‌లను పలువురు సెల్‌లో ఎక్కించి వినియోగించే తీరు వివరించారు.

అనాథాశ్రమానికి వితరణ

మాచర్ల: మున్సిపల్ చైర్మన్ తురక కిషోర్ తన కుమార్తె జయ అన్నపూర్ణాదేవి ప్రథమ జన్మదిన వేడుకలను రామకృష్ణ సేవా సమితి అనాథాశ్రమంలో విద్యార్థుల మధ్య కేక్ కట్ చేసి నిర్వహించి పంపిణీ చేశారు. శనివారం ఆశ్రమంలో నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ చైర్మన్ తురక కిషోర్ దంపతులు వృద్ధులు, అనాథలకు రూ. 5వేల నగదును అన్నదానానికి నిర్వాహకులు మెట్టు గోవిందరెడ్డికి అందజేశారు. మున్సిపల్ చైర్మన్ తురక కిషోర్ మాట్లాడుతూ తమ కుమార్తె జన్మదిన వేడుకలను అనాథ విద్యార్థుల మధ్య నిర్వహించడం ఎంతో సంతోషకరంగా ఉందని రాబోయే రోజుల్లోనూ అనాథాశ్రమానికి తన వంతు సహాయ సహకారాలుగా చేయూతనంది స్తామన్నారు. పురపాలక సంఘ కార్యాలయ వెనుక భాగంలో మంచి నీటి క్వారీ ప్రాంతంలో మొక్కలు నాటారు.

మూడు ద్విచక్ర వాహనాలు చోరీ

చిలకలూరిపేటటౌన్: ద్విచక్రవాహనాలు చోరీకి గురైన సంఘటన శనివారం వెలుగు చూసింది. రూరల్ పోలీసుల కథనం ప్రకారం బాపట్ల జిల్లా బల్లికురవ మండలం ఉప్పుమాగులూరు గ్రామానికి చెందిన కొర్రపాటి జోషి బాబు, తన మిత్రులతో మూడు ద్విచక్రవాహనాలపై పట్టణానికి తాగునీరు అందించే చెరువు సమీపంలో ఉన్న వెంచర్‌ను చూడటానికి వచ్చాడు. ఈ క్రమంలో వాహనాలను కాల్వ పక్కన పార్కు చేసి లోపలికి వెళ్లారు. పని ముగించుకుని తిరిగి వచ్చి చూసేసరికి వాహనాలు చోరీకి గురైనట్లు గ్రహించారు. శనివారం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సొలస పాఠశాలలో సత్కార కార్యక్రమం

యడ్లపాడు: మండలంలోని సొలస గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులకు గ్రామపెద్దలు శనివారం అభినందన సభను ఏర్పాటు చేశారు. ముందుగా జెడ్పీ హైస్కూల్‌కు చెందిన ఆరుగురు ఉపాధ్యాయులు విద్యాశాఖ నిర్వహించిన సాధారణ బదిలీ మరో ప్రాంతానికి బదిలీ అయ్యారు. వీరితోపాటు జగనన్న ఆణిముత్యాలకు ఎంపికైన పాఠశాలకు చెందిన విద్యార్థులు ముగ్గురిని ఘనంగా సత్కరించారు. ఇదే వేదికపై గ్రామంలోని ఏఏ ప్రాథమిక పాఠశాలలో విద్యాబోధన చేస్తున్న షేక్ జున్ను మాస్టార్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మద్దూరి విజయ బాలచంద్రా రెడ్డి, మాజీ ఎంపీటీసీ ఎం.వీరారెడ్డి, హైస్కూల్ హెచ్ఎం ఈవీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు.

డ్రైవింగ్ శిక్షణకుదరఖాస్తు చేయండి

నరసరావుపేట: ఆర్టీసీ డిపో ఆవరణలో నిర్వహిస్తున్న హెవీ మోటార్ డ్రైవింగ్ శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని లైట్ మోటార్ డ్రైవింగ్ లైసెన్స్ కల్గిన అభ్యర్థులకు డిపో మేనేజర్ బత్తుల వీరాస్వామి శనివారం కోరారు.. ఇప్పటివరకు 12 బ్యాచ్‌లకు శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు అందజేశామన్నారు.. 13వ బ్యాచ్ త్వరలో ప్రారంభిస్తున్నామన్నారు. ప్రతి బ్యాచ్‌కు 16 మందికి మాత్రమే అవకాశం ఉందన్నారు. ఇతర వివరాలకు 99592 25428, 73828 96038 సంప్రదించాలని కోరారు.

నిత్యావసర వస్తువులు పంపిణీ

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని ఏనుగుపాలెం రోడ్డులో గల చైతన్య నగర్‌నందు వినుకొండ చర్చ్ ఆఫ్ క్రైస్ట్ సొసైటీ వారి ఆధ్వర్యంలో వితంతువులకు శనివారం నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. సీఈవో ఎండీ రాజు మాట్లాడుతూ సొసైటీ తరపున భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో సొసైటీ ట్రెజరర్ ఎం.రమేష్‌బాబు, సెక్రటరీ ఎం.ప్రవళిక, సభ్యులు ఎన్. బ్రహ్మయ్య, టి.వెంకటకృష్ణ, సీహెచ్. సమర్పణరావు, కృష్ణ పాల్గొన్నారు.



అఖిలేష్‌కుమార్‌కు గోల్డ్‌మెడల్ ఇచ్చి అభినందిస్తున్న కలెక్టర్ , ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు గోల్డ్‌మెడల్స్

విజయపురిసౌత్: స్థానిక ఏపీఆర్ జూనియర్ కళాశాలలో 2022-23 విద్యా సంవత్సరంలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ముగ్గురు విద్యార్థులకు జగనన్న ఆణిముత్యాల కార్యక్రమంలో భాగంగా శనివారం పల్నాడు జిల్లాలో కలెక్టర్ లోతేటి శివశంకర్, ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి చేతుల మీదుగా గోల్డ్‌మెడల్స్ అందించారు. కళాశాలలో ఎంపీసీ ద్వితీయ సంవత్సరానికి చెందిన ఎస్ అఖిలేష్ కుమార్ 950 మార్కులు, బైపీసీకి చెందిన గుణశేఖర్ 938 మార్కులు, ఎంఈసీకి చెందిన తరుణ్ 940 మార్కులు సాధించారు. విద్యార్థులకు గోల్డ్‌మెడల్స్‌తో పాటు వారి తల్లిదండ్రులను కళాశాల ప్రిన్సిపల్ సరోజినిని కలెక్టర్ శివశంకర్, ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి శాలువాలతో ఘనంగా సత్కరించారు.

విద్యార్థులకు అండగా ప్రభుత్వం



జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో విద్యార్థులను అభినందిస్తున్ననగర పంచాయతీ చైర్మన్

దాచేపల్లి : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరుపేద విద్యార్థులకు ఉన్నతమైన చదువులను అందించటమే లక్ష్యంగా పనిచేస్తున్నారని నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సాంబయ్య అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్, ప్రభుత్వ ఆదర్శ పాఠశాల, మండలంలోని పలు జిల్లా పరిషత్ హైస్కూల్స్‌లో జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. పదవ తరగతి మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులకు ప్రభుత్వం నుంచి ప్రశంసాపత్రం, నగదు, షీల్డ్‌ను బహూకరించారు. ఈ సందర్భంగా చైర్మన్ సాంబయ్య మాట్లాడుతూ...ప్రభుత్వ పాఠశాలల్లో అత్యధికంగా పేద విద్యార్థులే చదువుకుంటారని, గత ప్రభుత్వాలు పేద విద్యార్థుల విద్యను విస్మరించాయని గుర్తు చేశారు. సీఎం జగనన్న ప్రభుత్వంలో పేద విద్యార్థులు ఉన్నతమైన చదువులను చదువుకునేందుకు అన్ని అవకాశాలు కల్పించారని, ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల వసతులు కలిప్పించి ఉన్నతమైన చదువులు చదువుకునేలా ప్రోత్సహించారని ఆయన చెప్పారు. జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ..గత ప్రభుత్వాల్లోని ప్రభుత్వ పాఠశాలలకు, వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోని పాఠశాలలకు ఉన్న వ్యత్యాసాన్ని విద్యార్థులు, తల్లిదండ్రులు గమనించాలని, ప్రభుత్వ పాఠశాలలను సామాజిక దేవాలయాలకు సీఎం జగన్ తీర్చిదిద్దారన్నారు. ఏపీలో చదువుల విప్లవం తెచ్చిన ఘనత సీఎం జగన్‌కు మాత్రమే దక్కుతుందని, సీఎం జగన్ అమలు చేస్తున్న పథకాలతో ప్రభుత్వ పాఠశాలలు విద్యార్థులు కిక్కిరిసిపోతున్నాయని ఆయన తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ షేక్ ఖాదర్‌భాషా, మాజీ సర్పంచ్ బుర్రి విజయ్‌కుమార్‌రెడ్డి, ఎస్ఎంసీ కమిటీ చైర్మన్ షేక్ సైసావలి, మాజీ మండల కన్వీనర్ షేక్ జాకీర్‌హుస్సేన్, కౌన్సిలర్ నాగుబండి గురువులు, నాయకులు కుందురు తిరుపతిరెడ్డి, కొమ్మా కరుణకర్, ముంద్రా శ్రీనివాసరావు, ఐనాల శ్రీరాములు, నెల్లూరి కోటేశ్వరరావు, ప్రధానోపాధ్యాయుడు ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులను సన్మానిస్తున్న జెడ్పీటీసి శెట్టిపల్లి యలమంద

విద్యాభివృద్ధికి సీఎం జగన్ కృషి మరువలేనిది

దుర్గి: 10వ తరగతి పరీక్షా ఫలితాల్లో ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమాన్ని దుర్గి జెడ్పీహెచ్ఎస్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రథమ బహుమతి గై వరలక్ష్మికి రూ. 3వేలు నగదు, షీల్డ్ ప్రశంస పత్రం, ద్వితీయ బహుమతి కపలవాయి లక్ష్మీ అపర్ణకి రూ. 2వేలు నగదు, షీల్డ్ ప్రశంస పత్రం, తృతీయ బహుమతి చిమటా వరుణ్ సందేశ్ రూ. 1000 నగదు, షీల్డ్ ప్రశంస పత్రాలను జెడ్పీటీసి శెట్టిపల్లి యలమంద, ఎస్ఎంసి చైర్మన్ తోటకూర వెంకటేశ్వర్లు చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం జగన్మోహన్‌రెడ్డి విద్యార్థులకు మేనమామ కన్నా ఎక్కువ విద్య అభ్యసించడానికి కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం పి కోటేశ్వరమ్మ, సర్పంచ్ రాయపాటి మాణిక్యం, ఎంపీటీసి కటకం గోపాల్, సీనియర్ ఉపాధ్యాయులు పి మల్లిఖార్జునరావు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

జెడ్పీ హైస్కూలుకు అదనపు హంగులు

- పూర్వ విద్యార్థుల సహకారంతో పలు వసతులు
- రూ.20లక్షలతో కాన్ఫరెన్స్ హాలు, అదనపు తరగతి గది నిర్మాణం



శ్లాబ్ పనులు పర్యవేక్షిస్తున్న పూర్వ విద్యార్థుల సంఘం సభ్యులు

ముప్పాళ్ల: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో కాన్ఫరెన్స్ హాలు, తరగతి గది నిర్మాణం పనులు చివరి దశకు చేరుకున్నాయి. శనివారం గది శ్లాబు చేపట్టారు. సుమారు రూ.20లక్షలతో పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు మారూరి రామలింగారెడ్డి మాస్టారు ఆధ్వర్యంలో కాన్ఫరెన్స్ హాలు, అదనపు తరగతిగది నిర్మాణ పనులు చేపట్టారు. 1952 నుంచి ఇప్పటి వరకు పాఠశాలలో చదువుకున్న వారంతా సంఘంగా ఏర్పడి నిర్మాణ పనులు చేపట్టినట్లు ట్రెజరర్ ఏ.ఈశ్వరరెడ్డి తెలిపారు. విద్యార్థులకు మౌలిక వసతులు కల్పనే ప్రధానంగా పూర్వ విద్యార్థుల సంఘం పని చేస్తోందని చెప్పారు. త్వరలో జరగబోయే 75సంవత్సరాల వేడుకలకు సిద్ధం చేయనున్నట్లు తెలిపారు. పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థులంతా ఈ సత్సంకల్పంలో భాగస్వాములు కావాలని వారు కోరారు. ఆయా గ్రామాల్లో ఉన్నవారితో పాటుగా, వేరే ప్రాంతాల్లో ఉన్న వారిని సైతం ఈ కార్యక్రమంలో భాగస్వాముల్ని చేసేందుకు గాను వారి వివరాలను 9966068116 నంబర్‌కు వాట్సాప్ ద్వారా తెలియజేయాలని కోరారు.

డ్రిప్ ఇరిగేషన్‌కు దరఖాస్తు చేసుకోండి

మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు అధికారి సీహెచ్ ఆంజనేయులు



వెల్దుర్తి ఆర్‌బికెలో రైతులతో మాట్లాడుతున్న మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు అధికారి ఆంజనేయులు

వెల్దుర్తి: మండలంలోని వివిధ గ్రామాల్లో డ్రిప్ ఇరిగేషన్ కోసం దరఖాస్తులు చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు అధికారి సీహెచ్ ఆంజనేయులు అన్నారు. శనివారం వెల్దుర్తి మండల కేంద్రమైన రైతు భరోసా కేంద్రంలో రైతులతో మాట్లాడారు. డ్రిప్ (తుంపర్లు) సబ్సిడీలు కావాల్సిన వారు ఐదు ఎకరాలలోపు ఉన్న పొలాలకు 90 శాతం సబ్సిడీ, మిగిలిన పది శాతం రైతు చెల్లించాలన్నారు. ఐదు ఎకరాల కన్నా ఎక్కువ పొలం ఉన్న వారు శాతం 50 సబ్సిడీ, 50 శాతం నాన్ సబ్సిడీ ఇస్తామన్నారు. స్ప్రింకర్ల పైపులు సబ్సిడీ ఐదు ఎకరాలలోపు ఉన్న పొలాలకు 55 శాతం సబ్సిడీ, మిగిలిన 45 శాతం రైతు చెల్లించాలన్నారు. ఐదు ఎకరాల కన్నా ఎక్కువ పొలం ఉన్న వారు 45 శాతం సబ్సిడీ, 55 శాతం నాన్ సబ్సిడీ ఇస్తామన్నారు. దరఖాస్తు చేసుకునే రైతులు ఆధార్ కార్డు, పట్టాదారు పాసుపుస్తకము, 1బి, ఎఫ్ఎంబి, బ్యాంకు పాసుపుస్తకాలను జత చేయాలన్నారు. మండలంలోని అన్ని ఆర్‌బికెల సిబ్బంది పాల్గొన్నారు.